క్లుప్తంగా

ఐరన్‌లోడు లారీ బోల్తా



డొంకినవలస రైల్వే ఖానా వద్ద పడిపోయిన లారీ

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వే ఎత్తు ఖానా పైనుంచి ఐరన్‌లోడు లారీ బోల్తాపడింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్‌లోడుతో రామభద్రపురం నుంచి బాడంగి మీదుగా బొబ్బిలి వైపు వెళ్తున్న ఈ లారీ ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ సేఫ్‌గార్డును ఢీకొని పడిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఎరువుల పంపిణీ



కోడిశలో రైతులకు ఎరువులు అందిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని 25 గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, డీఏపీ వంటి ఎరువులు రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతున్నామని ఏవో మురళీకృష్ణ తెలిపారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: స్థానిక రఘు కళాశాలలో ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్)ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనంద్, సత్యనారాయణ, ధనుంజయ్, లోకేష్, సంతోష్‌కుమార్‌లు కలిసి ఇన్నాళ్లు ఏబీవీపీ సాధించిన విజయాలు, ఉద్దేశ్యాలు, భవిష్యత్‌లో వేటిపై పోరాడాలన్న అంశాలను వివరించారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రేగిడి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని లచ్చారాయపురం, జాడాపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కేంద్రాల వద్ద పలు మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను చిన్నారుల తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం మొక్కల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి రైతు భరోసా కేంద్రం వద్ద సేంద్రియ ఎరువుల తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ఎం.శ్యామసుందర్..సేంద్రియ ఎరువుల తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్యవంతమైన పంట పొందడంతో పాటు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి తద్వారా కాలుష్యం తగ్గించినవారమవుతామన్నారు.

విద్యాసామగ్రి అందజేత

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, ఆట వస్తువులను మంగళవారం అందజేశారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.మోజేష్, ఉపాధ్యాయుడు కృష్ణదాస్ వీటిని విద్యార్థులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ కూడలి వద్ద సీఐటీయూ నేతలు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రైవేట్ టెలికాం రంగ సంస్థలైన జియో, ఎయిర్‌టెల్‌లు మొబైల్ రీచార్జ్ చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వమే కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజానీకంపై భారీ భారం పడేలా చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, బి.యుగంధర్, జి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఖండ్యాం, వెంకటాపురం గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్‌ల పర్యవేక్షణలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు పూడికలు తొలగిస్తున్నారు. అనంతరం బ్లీచింగ్ చల్లి, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కలిప్తున్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.

రాజాం: మండలంలోని అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని పొగిరి, బొద్దాం, కంచరాం, ఆగూరు గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరం చేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నేలబావులు, తాగునీటి బోర్లలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నిర్లక్ష్యం వద్దు..

బొబ్బిలి రూరల్: పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీవో పి.రవికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఫోన్‌లో మంగళవారం మాట్లాడిన ఆయన వారి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరాతీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ఎక్కడా అపరిశుభ్రత ఉండకుండా చూడాలని సూచించారు. ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలు, నేలబావులు, తాగునీటి బోర్లలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని, కాలువలు, పెంటల వద్ద బ్లీచింగ్ చల్లాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.



రేగిడి: లక్ష్మీపురంలో కాలువల్లోని పూడికలు తీయిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు



రాజాం: పొగిరిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

తెర్లాం: గ్రామంలోని తాగునీటి వనరుల ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయమని మండలంలోని కూనాయవలస గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి బోడెల విజయబాబు అన్నారు. మండలంలోని కూనాయవలస గ్రామంలోని నేలబావుల్లో క్లోరినేషన్ చర్యలతో పాటు అక్కడి ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలను పంచాయతీ కార్యదర్శి స్వామి పర్యవేక్షణలో మంగళవారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని నేలబావుల్లో క్లోరినేషన్ చేయించామన్నారు. పాఠశాల ఆవరణలో, పరిసరాల్లో, మురుగుదొడ్లు, తాగునీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్, సున్నం కలిపి జల్లామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజాంలో ఫాగింగ్ చర్యలు

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో ఫాగింగ్ చర్యలు మంగళవారం చేపట్టారు. దోమల నియంత్రణలో భాగంగా ప్రతీ వార్డుకు పారిశుధ్య సిబ్బంది వెళ్లి, ఫాగింగ్ చేస్తున్నారని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.



తెర్లాం: కూనాయవలసలో నేలబావుల్లో క్లోరినేషన్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి స్వామి



రాజాం పట్టణంలో ఫాగింగ్ చేపడుతున్న దృశ్యం



తెర్లాం: కూనాయవలస పాఠశాల తాగునీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ జల్లుతున్న గ్రీన్ అంబాసిడర్

ముమ్మరంగా వాహన తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని రాజా కళాశాల వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను సీఐ ఎం.నాగేశ్వరరావు పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ హెచ్చరించారు. మండలంలోని మడ్డువలస జంక్షన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట కూడలిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. పరిమితికి మించి వేగం, లోడుతో ప్రయాణించరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.



వంగర: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ జనార్దన్

సకాలంలో సేవలందించాలి



శ్యాంపురం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: సకాలంలో ప్రజలకు సేవలందించాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శ్యాంపురం, బొద్దాం గ్రామ సచివాలయాలను మంగళవారం సందర్శించిన ఆయన.. బకాయి ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. ఏదైనా సమస్యతో సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని విజయరాంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించి, పౌష్టికాహార నిల్వలు, రికార్డులను పరిశీలించారు. చిన్నారుల బరువు, ఎత్తులు సరిచూసి, ప్రీస్కూల్ పిల్లలకు నేర్పించిన పాటలు, బొమ్మల పేర్లను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యకర్తలంతా నిర్ణీత సమయానికి కేంద్రాలు తెరవాలని, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్ని రికార్డులను ఆఫ్‌లైన్‌లోను, ఆన్‌లైన్‌లోనూ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.



విజయరాంపురం కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు



సినిమా థియేటర్ లోపల వసతులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ

బొబ్బిలి: పట్టణంలోని పలు సినిమా థియేటర్లలో ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రేక్షకులకు హాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, యజమానులకు పలు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, తినుబండారాలు ఎప్పటికప్పుడే తయారుచేసి అమ్మాలని, ప్రేక్షకులు కూర్చొనే సీట్లు బాగా ఉండేలా చూడాలని, తెర, సౌండ్ సిస్టమ్ బాగా ఉండేలా చూడాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ త్రినాధనాయుడు, హెచ్‌డీటీ చిన్నారావు, ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి తదితరులు ఉన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందజేత

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి గ్రామంలో 70 మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు మంగళవారం అందజేశారు. కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాలు వర్తింపజేస్తామని ఏవో ఎం.శ్యామసుందర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలో గుర్తించిన కౌలురైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులతో పాటు వ్యవసాయ రుణాలు కూడా అందిస్తామని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని కొమెర, వెంకటాపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లో కౌలురైతులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ప్రతీ గ్రామంలో కౌలురైతుల గుర్తింపు జరుగుతోందని, మండలంలో ఇంతవరకు 132 మంది కౌలురైతులను గుర్తించామని తెలిపారు. అనంతరం కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందజేశారు.

గ్రామసభల్లో కౌలురైతుల గుర్తింపు..

వంగర: గ్రామాల్లో కౌలురైతులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. మండలంలోని కోనంగిపాడు, మరువాడ, కింజంగి గ్రామాల్లో కౌలురైతుల గుర్తింపు కోసం గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలురైతుకు పంటపై హక్కు ఉంటుందని కానీ రైతు నుంచి పొందిన భూమిపై ఎటువంటి హక్కులు ఉండవని తెలిపారు. కౌలురైతులకు రైతుల మాదిరిగానే ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక తాతబాబు, వీఆర్‌వోలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందజేస్తున్న ఏవో శ్యామసుందర్



రేగిడి: ఖండ్యాంలో కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందిస్తున్న ఏవో మురళీకృష్ణ



వంగర: గ్రామసభలో మాట్లాడుతున్న ఏవో కన్నబాబు

వినతిపత్రం అందజేత



కేంద్రమంత్రికి హమాలీల సమస్యలు వివరిస్తున్న బొబ్బిలి పట్టణ కలాసీల సంఘ కార్యదర్శి వర్మ, పక్కనే ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును బొబ్బిలి పట్టణ కలాసీల సంఘ కార్యదర్శి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి రైల్వే లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న లోడింగ్ కేంద్రాన్ని కేంద్రం రద్దు చేయాలనే ఆలోచన చేస్తోందని, అలా జరిగితే వందలాది హమాలీల కుటుంబాలు రోడ్డునపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబినాయన ఉన్నారు.

మాజీ మంత్రి బొత్సకు పుట్టినరోజు శుభాకాంక్షలు



మాజీ మంత్రి బొత్సకు బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ తదితరులు

రాజాం: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలోని ఆయన ఇంటి దగ్గరకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, డాక్టర్ నరేంద్రలు మంగళవారం వెళ్లి, పుష్పగుచ్ఛం అందజేసి, బర్త్‌డే విషెస్ చెప్పారు. స్వీట్లు తినిపించి, నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

రేగిడిలో దొంగలు పడ్డారు..!

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలుపడ్డారు. మామిడి హేమలతకు చెందిన పెంకుటిల్లు పైకప్పు పెంకులు తీసిమరీ, ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని బీరువా పగలగొట్టి, అందులో ఉన్న వస్తువులతో పాటు ఇంట్లోని పలు విలువైన వస్తుసామగ్రిని మూటకట్టి బాత్‌రూమ్‌లో దాచారు. ఇంతలో జనసంచారం ప్రారంభం కావడంతో దొంగలు ఆ మూటను అక్కడే విడిచిపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. విశాఖపట్నంలో ఉంటున్న తన కొడుకు పెద్దఅప్పలనాయుడు ఇంటికి హేమలత వెళ్లడం గమనించిన దుండగులు చోరీకి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు రేగిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



హేమలత ఇంట్లో దొంగలు దాచి ఉంచిన వస్తుసామగ్రి మూట

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బాడంగి: సూచనలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, వైద్యా సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మంగళవారం సమావేశమైన ఆయన.. వర్షాకాలంలో కలుషిత నీరు, ఆహారం, దోమలు కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో దోమలు పెరగకుండా చూడాలని, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మాన్‌రాజ్, వైద్యాధికారులు సుష్మితాదయాన, జ్యోతి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఆంజనేయులు మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అక్రమంగా మైనింగ్, ఇసుక, కంకర వంటివి తరలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచికరంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో దుర్గారావు



తెర్లాం: అంట్లవార పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

రాజాం: పట్టణ పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో–2 యాగాటి దుర్గారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన వంటకాలను రుచిచూసి పరిశీలించారు. వంటకాలు రుచికరంగా ఉండాలని, వంటగది, పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పిల్లల నడవడిక, చదువుపై దృష్టిసారించాలని, పాఠశాలలో చెప్పిన విషయాలు ఇంటి దగ్గర కూడా నేర్చుకునేలా చూడాలని తెలిపారు.

తెర్లాం: మండలంలోని అంట్లవార ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు మంగళవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు ఆహారం వడ్డించాలని సిబ్బందికి తెలిపారు. పాఠశాల పరిసరాలు, వంటగది పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా తరగతుల వారీగా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు.

ఆక్రమణలు తొలగించండి

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్‌లోని మురుగునీటి కాలువపై ఆక్రమణలు తొలగించాలని సంబంధిత యజమానులను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు హెచ్చరించారు. పూడికలతో కాలువ నిండిపోగా, మురుగునీరు రోడ్డుపైకి రావడాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన.. అక్కడి షాపుల యజమానులు పూర్తిస్థాయిలో కాలువను ఆక్రమించిన కారణంగానే ఈ దుస్థితి అని తెలుసుకున్నారు. శనివారం నాటికి ఆక్రమణలు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని తెలిపారు.



మాధవబజార్‌లో కాలువపై ఆక్రమణలు

ఉచితంగా ఇసుక అందిస్తున్నాం..

రాజాం: ఉచిత ఇసుక పాలసీ ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. స్థానిక పట్టణంలోని తన నివాసం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచితంగా ఇసుక అందించడం ప్రారంభించిందన్నారు. ఇసుక ర్యాంపులు, రీచ్‌ల వద్ద ఎటువంటి అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం చీపురుపల్లి నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ పీడీ వి.శ్రీనివాసరావు, డీఈ రమణరాజులతో సమీక్షించారు.